క్లుప్తంగా

దేవాలయాల అభివృద్ధికి కృషి



ఎన్.కొత్తపల్లిలో భూమి పూజ చేస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: దేవలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని ఎన్.కొత్తపల్లిలో ఉమా బ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రహారీ గోడ నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ నిధుల నుంచి రూ.13 లక్షలు ప్రహారీ నిర్మాణానికి కేటాయించామని తెలిపారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఈ దేవాలయాన్ని త్వరగా పూర్తి చేయాలని, ఈ నిర్మాణానికి తన వంతు బాధ్యతగా నిధులు తెచ్చి సహకరిస్తానని మంత్రి అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి వాసురాజు, కుంచే చిన్ని, బొడ్డు నాగేశ్వరరావు, అంగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాపునాడు అధ్యక్షుడు సురేష్‌కు సత్కారం



సురేష్‌ను సత్కరిస్తున్న కాపు సంఘం నాయకులు

అమలాపురం రూరల్: జిల్లా కాపునాడు సంఘం అధ్యక్షుడు అబ్బిరెడ్డి వెంకట స్వామి (సురేష్)ను కాపు సంఘం నాయకులు మంగళవారం అభినందించారు. రాష్ట్ర కాపు సంఘం నాయకులు నల్లా అజయ్, నల్లా సంజయ్ ఆయనను సత్కరించి కాపు, తెలగ, బలిజ, ఒంటరి, కులస్తులు సంక్షేమానికి కృషి చేయాలని కోరారు.

ఘనంగా ముగిసిన కిమ్స్ క్రీడలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న చైతన్యరాజు

అమలాపురం రూరల్: కిమ్స్ ఆసుపత్రిలో నెల రోజులుగా జరగుతున్న ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ మంగళవారం ముగిసింది. కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైనత్యరాజు), ఎండీ రవికిరణ్‌వర్మ మాట్లాడుతూ తమ సంస్థ ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏటా జనవరిలో ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజేతలకు చైర్మన్ చైనత్యరాజు, ఎండీ రవికిరణ్‌వర్మ బహుమతులు అందించారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందుకున్న విద్యార్థినులతో ట్రస్ట్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక చిక్కం సరస్వతి, భాస్కరరావు చారిటబుల్ ట్రస్ట్ సంక్రాంతి పండుగ సందర్భంగా ఐదుగురు పేద విద్యార్థులకు మంగళవారం రూ.రెండు వేల వంతున ఆర్థిక సాయాన్ని అందించింది. స్థానిక డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు పార్కు వద్ద ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ చిక్కం సత్యనారాయణమూర్తి ఈ సాయాన్ని తడాల హేమ నాగ లక్ష్మీదుర్గ, మేడిద విజయదుర్గ, అరిగెల జయంతి, ముంతా వీర సాయి, ఆకుల శ్రీమహాలక్ష్మిలకు అందజేశారు.

అగ్ని ప్రమాద బాధితునికి వితరణ



వానపల్లిపాలెంలో బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న స్థానిక నాయకులు

ఉప్పలగుప్తం: మండలంలోని వానపల్లిపాలెం పంచాయతీ పరిధి బీవీఆర్ నగర్‌లో సోమవారం సాయంత్రం ఇల్లు దగ్ధమై ప్రమాదానికి గురైన బాధితుడు జొన్నాడ వీరాస్వామి కుటుంబానికి పలువురు మంగళవారం ఆర్థిక సామం అందించారు. మండల ఉపాధ్యక్షుడు సాదే శ్రీనివాసరావు బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. గ్రామస్తులు పలువురు నగదు రూపంలో ఆర్థిక సాయాన్ని అందించారు. నల్లా నాయుడు, శ్రీనివాసరావు, సూర్యప్రకాష్, ముత్తాబత్తుల వజ్రం, కొల్లు మోషేన్, మోకాదుర్గారావు, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ దుస్తుల్లో అలరిస్తున్న గొల్లగూడెం ఆదిత్య పాఠశాల విద్యార్థులు



విద్యార్థులు ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు



యానాం రీజెన్సీ ఉన్నతపాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో టీచర్లు

సంక్రాంతి వేళ సంప్రదాయం వెల్లివిరియాలి

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- పి.మల్లవరంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల ప్రారంభం

తాళ్లరేవు: సంక్రాంతి పండగను ప్రజలు సాంప్రదాయ క్రీడలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కోరారు. మంగళవారం పి.మల్లవరం గ్రామంలో 11వ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే పొన్నాడ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు జూదాల జోలికి పోకుండా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర క్రీడలతో జరుపుకోవాలన్నారు. గత 11 ఏళ్లుగా రాష్ట్రస్థాయి క్రీడలను నిర్వహించడంతోపాటు అందరికీ భాగస్వామ్యం కలుగజేస్తున్న పి.మల్లవరం మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడుపూడి శివన్నారాయణను ఎమ్మెల్యే అభినందించారు. విశిష్ట అతిథి కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు జూదాల జోలికి వెళ్లకుండా సంప్రదాయ క్రీడల్లో పాల్గొనడం ద్వారా స్నేహ పూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. అతిథులను శివన్నారాయణ ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే పొన్నాడ వాలీబాల్ ఆడారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన జట్ల మధ్య వాలీబాల్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, పార్టీ రాష్ట్ర నేతలు దున్నా జనార్దన రావు, చింతలపాటి శ్రీనివాసరాజు, కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు, కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టేకిళ్లపూడి నాగేశ్వరరావు, నాయకులు రాయుడు గంగాధర్, కొపనాతి నాగరాజు, పెయ్యల మంగేష్, రేవు మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పి.మల్లవరంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ



బీవీసీ కళాశాలలో భోగి మంట ముందు కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

అమలాపురం టౌన్: స్థానిక గొల్లగూడెంలోని ఆదిత్య స్కూలు ప్రాంగణంలో మంగళవారం సంక్రాంతి సంబరాలు జరిగాయి. సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య రూపకాలు అలరించాయి. స్కూలు ప్రిన్సిపాల్ కుంపట్ల లక్ష్మీదేవి, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో సంబరాలు జరిగాయి.

కామనగరువులో..

అమలాపురం రూరల్: కామనగరువు ఆదిత్య పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. పలు పోటీలు నిర్వహించి విజేతలను పాఠశాల ప్రిన్సిపాల్ బి.రామ ప్రసాద్, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతి రెడ్డి అభినందించారు.

బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో..

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విభాగాల వారీగా కేరళ వాయిద్యాలు, తీన్‌మార్ డప్పుల, డీజే బాక్సుల కోలాహలం మధ్య విద్యార్థులు కోలాటం నిర్వహించారు. అనంతరం బొమ్మల కొలువు పిండి వంటలు ప్రదర్శించారు. ఆద్యంతం వైభవంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి స్వామివారి ప్రభను ఊరేగించారు. బీవీసీ అధినేత బోనం కనకయ్య, చైర్మన్ కృష్ణ సతీష్, డీన్ టీవీ జనార్ధనరావు, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దొమ్మేటిపేట పాఠశాలలో భోగి సందడి

యానాం: యానాంలోని పలు పాఠశాలల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక రీజెన్సీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో చిన్నారులకు భోగిపళ్ల ఉత్సవం, రెండవ తరగతి విద్యార్థులకు గొబ్బెమ్మలతో ఆటలు నిర్వహించారు. బొమ్మలకొలువు, రంగవల్లులు తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో మద్దింశెట్టి జ్యోతిప్రసాద్ ప్రారంభించగా, హెచ్‌ఎం టీవీఎస్ ఎస్‌వీ ప్రసాదరావు, సీహెచ్ వీరభద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొమ్మేటిపేట స్కూల్‌లో..

దొమ్మేటిపేట ఇసుకకాలువ, సర్‌ఆర్థర్ కాటన్ ప్రభుత్వప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం బొంతు సత్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.



సంక్రాంతి సంప్రదాయాలను పాటిస్తూ సందడి చేస్తున్న కామనగరువు ఆదిత్య పాఠశాల విద్యార్థులు



యానాంలో సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు

శాఖల ప్రగతిపై సమీక్ష

సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం

అల్లవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. మండలంలో 5,800 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా ఇప్పటి వరకు 2,500 ఎకరాల్లో వరినాట్లు వేశారని, 1500 ఎకరాల్లో ఈ-పంట నమోదు పూర్తి చేసినట్టు వ్యవసాయధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. దాళ్వా సీజన్‌కి సాగునీరు పుష్కలంగా ఉంటుందని ఇరిగేషన్ ఏఈ రెహమాన్ తెలిపారు. లోయర్ కౌశికలో డ్రెడ్జింగ్ చేయాల్సి ఉందని, బెండా నార్త్ స్లూయిజ్‌కి ప్రతిపాదనలు చేసి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని డ్రైన్ల ఏఈ సునీతాదేవి తెలిపారు. జల్ జీవన్ మిషన్ రెండో పథకంలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు టెండర్ల స్థాయిలో ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ అందించే ప్రయత్నం చేస్తున్నామని ఎంఈఓ కిరణ్‌బాబు తెలిపారు. మండలంలోని ఆరు లే అవుట్లలో 680 ఇళ్లు మంజూరయ్యాయని హౌసింగ్ ఏఈ సుబ్బారావు తెలిపారు. ఇళ్ల స్థలాల కోసం 90 రోజుల దరఖాస్తుని సచివాయలంలో అందించవచ్చుని తహసీల్దార్ సాంబశివప్రసాదు తెలిపారు. సచివాలయాల పరిధిలో నిర్మాణంలో ఉన్న భవనాలు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సర్పంచ్‌లు మండల సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తీర ప్రాంతంలో సీఆర్‌జెడ్ ప్రాంతంలో అనధికార చెరువులపై ఏమి చర్యలు తీసుకుంటున్నారో వివరణ ఇవ్వాలని ఎఫ్‌డీఓ హేమానంద్‌ని గూడాల సర్పంచ్ చిరంజీవి రావు ప్రశ్నించారు. ఎస్.రామేశ్వరం గ్రామానికి చెందిన మత్స్యకార సొసైటీలో నూతనంగా చేరిన 237 సభ్యులను సొసైటీలో ప్రాతినిధ్యం కల్పించాలని ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరావు ఎఫ్‌డీఓను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల వెంకటరామకృష్ణ, ఎంపీటీసీలు ఎస్.మౌనిక, గుబ్బల రంగనాథస్వామి, రాజేశ్వరి, కుంచే సత్యనారాయణ, మాకే కృష్ణమూర్తి, జల్లి మరియమ్మ, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, రొక్కాల విజయలక్ష్మి, బొమ్మి బాలవేణి, రాకాపు విజయలక్ష్మి, మల్లాడి మంగయమ్మ, బర్రే సీతారత్నం, ఎంపీడీఓ సరోవరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- మంత్రి పినిపే విశ్వరూప్
- దేవగుప్తంలో గడప గడపకూ..

అల్లవరం: సంక్షేమ పథకాలు పొందని వారికి మే, డిసెంబర్ నెలల్లో మరో అవకాశం కల్పించి సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండల నోడల్ అధికారి జి.సరోవరరావు ఆధ్వర్యంలో దేవగుప్తం పంచాయతీ పరిధిలో మంగళవానం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాల పనితీరు, అందుతున్న విధానంపై మంత్రి ఇంటింటా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకే చేరుతున్నాయా లేదా అనే విషయాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు దృష్టి సారించాలని మంత్రి అన్నారు. సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులు సచివాలయ సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాశిపేట, పేదాంధ్రపేట, కర్రిచెరువు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. మంత్రి వెంట ఆయన తనయుడు పినిపే శ్రీకాంత్ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల రామకృష్ణ, సర్పంచ్ సాధనాల వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఉండ్రు వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షుడు యల్లమిల్లి బోసు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరమట శ్రీను, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అవ్వను అడుగుతున్న మంత్రి విశ్వరూప్

నయనానందకరంగా నవ కలశ స్నపనం

అమలాపురం టౌన్: ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో జరుగుతున్న తిరుప్పావై సేవల్లో భాగంగా శ్రీకృష్ణుడు, గోదాదేవిలకు మంగళవారం సంధ్య వేళ తిరుప్పావై సేవా కాలం జరిగింది.

అనంతరం కృష్ణ పరమాత్ముడు, గోదాదేవిలకు నవ కలశ స్నపనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు జీయర్ స్వామి పాలు, పెరుగు, తేనె, పండ్ల రసాలు వంటి తొమ్మిది రకాల ద్రవ్యాలతో జరిగిన అభిషేకాన్ని భక్తులు వీక్షించారు. అనంతరం తీర్థ గోష్ఠి, ప్రసాద వితరణ జరిగాయి. ఉత్సవ కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాస్, పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య తదితరులు భక్తులకు సేవలు అందించారు.



శ్రీకృష్ణుడు, గోదాదేవిలకు నవ కలశ స్నపనం చేస్తున్న అర్చకులు

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

ముమ్మిడివరం: యువత తమ ప్రతిభను సమాజ హితం కోసం ఉపయోగించిన నాడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని రావి ఫౌండేషన్ చైర్మన్ రావి బాలకృష్ణ బాబ్జీ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పి.శివనాగరాజు అధ్యక్షతన మంగళవారం నెహ్రూ యువక కేంద్రం, పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ యువజన వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతి ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత స్వామి వివేకానంద చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాలులర్పించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఆయన బాటలో పయనించాలన్నారు. అనంతరం విజేతలకు రూ.వెయ్యి నగదు, జ్ఞాపికలు అందజేశారు. సమత రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు రజని, బీఎస్ఎన్ రెడ్డి ట్రస్టు చైర్మన్ గిడ్డి ప్రభాకరరెడ్డి, పీటీఎం సంస్థ వ్యవస్థాపకులు పుల్లెపు వెంకటేశ్వరరావు, కర్నీడి వెంకటేశ్వరరావు, రాంజీ పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సంస్థ సభ్యులు

ఆ జీవోను రద్దు చేయాలి

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీవో 1ని రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగల ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ జీవో రద్దు చేసే వరకూ అన్ని పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని పోరాటాలు చేస్తామన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు అధ్యక్షతన మంగళవారం రాత్రి జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ రాపాక పవన్, విద్యార్థి సంఘం నాయకుడు వి.చందు, మాజీ కౌన్సిలర్ అయితాబత్తుల కుమార్ సింగ్ తదితరులు సమావేశంలో మాట్లాడారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

ముమ్మిడివరం: రోడ్డుషోలు, ర్యాలీలు నియంత్రించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబరు-1ను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రాన్ని తహసీల్దార్ వై.రాంబాబుకు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్: పేరూరు 33/11కేవీ సబ్ స్టేషన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల వల్ల బుధవారం పట్టణంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఈఈ మోకా రవికుమార్ తెలిపారు. ఎస్‌కేబీఆర్ కళాశాల ఫీడర్, పేరమ్మ అగ్రహారం, వెంకటకృష్ణాపురంకాలనీ, ఎత్తు రోడ్డు, ఏవీఆర్ నగర్, బీవీఎన్ కాలనీ, ఎల్‌ఐసీ కార్యాలయం కుమర్ల వీధి, కురసాలవారి వీధి, ఎస్‌కేబీఆర్ కళాశాల తదితర ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని అన్నారు. పట్టణ విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

రేపు సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ రాక

అమలాపురం టౌన్: ఏపీ సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్ గురువారం అమలాపురం రానున్నారు. ఆయన స్థాపించిన అంబేద్కర్ ఇండియా మిషన్ సంస్థ ద్వారా ఎస్సై, కానిస్టేబుళ్ల పోస్టులకు వెళ్లే అభ్యర్థులకు అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో గురువారం ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నారు. అభిమానులు, అంబేద్కర్‌వాదులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా కన్వీనర్ జల్లి సుబ్బారావు మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే డిమాండ్లపై పాలకుల్లో కదలిక

- సమస్యలను శాఖాపరంగా పంపాలని అధికారులకు ఆదేశం

యానాం: ప్రజాసమస్యలను పరిష్కరించాలని ఆమరణ నిరాహార దీక్ష చేసిన ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్న 15 డిమాండ్లకు సంబంధించి శాఖాపరంగా తక్షణం పుదుచ్చేరికి పంపాలని మంగళవారం పుదుచ్చేరి కేబినెట్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి ఎంవీ హిరాన్ వివిధ శాఖలకు ఆదేశాలు జారీచేశారు. డిమాండ్లను పరిష్కరించాలని ఎల్జీ తమిళిసై సౌందరాజన్ రాజ్‌నివాస్ నుంచి ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో కేబినెట్ శాఖ స్పందించింది. ముఖ్యంగా ఆరోగ్య, రెవెన్యూ, ఆదిద్రావిడ, ఉమెన్ అండ్ చైల్డ్‌వెల్ఫేర్, లోకల్ అడ్మినిస్ట్రేషన్, పీడబ్ల్యూడీ, సివిల్ సప్లయిస్, హెచ్‌ఆర్‌ఐ, పరిశ్రమలు, కార్మికశాఖ తదితర వాటికి ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

నేడు జగనన్న సంక్రాంతి సంబరాలు

అమలాపురం టౌన్: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జగనన్న సంక్రాంతి సంబరాలు బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరుగుతాయని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని వెంకట చంద్ర శేఖర్ (బులి నాని) తెలిపారు. పట్టణ పార్టీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాన్ని మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ సంబరాల్లో పాల్గొనేందుకు, వీక్షించేందుకు పట్టణ ప్రజలతో పాటు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని బులినాని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు



విద్యుత్ కాంతుల్లో దర్గా

అమలాపురం టౌన్: సయ్యద్ హజరత్ ఖాజా బాబా 65వ ఉర్సు మహోత్సవాలు స్థానిక దర్గాలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేందుకు దర్గా కమిటీ ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు దర్గా కమిటీ ప్రతినిధులు ఎండీ ఖాజా షరీఫ్, సయ్యద్ హజారి, మహ్మద్ బషీర్ తెలిపారు. పట్టణ ముస్లింలు పాల్గొని బాబా గంధం స్వీకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో దిలీప్‌కుమార్ ప్రతిభ



సాధించిన కప్‌తో దిలీప్‌కుమార్

అమలాపురం టౌన్: అనకాపల్లి ఏఎంఏఎల్ కాలేజీ క్రీడా మైదానంలో ఈనెల 7 నుంచి రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. చిత్తూరు జిల్లా జట్టుతో ఫైనల్‌లో తలపడి విజయ కేతనం ఎగురవేసింది. అమలాపురం శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో చదువుతున్న సానబోయిన దిలీప్‌కుమార్ జిల్లా జట్టులో క్రీడా ప్రతిభను చాటి అమలాపురం బాస్కెట్ అసోసియేషన్, శ్రీ చైతన్య కాలేజీ యాజమాన్యం నుంచి అభినందనలు అందుకున్నాడు. బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు సంసాని గంగాధర్, కుడుపూడి బుజ్జి, నడింపల్లి అప్పలరాజు, శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం దిలీప్‌ను అభినందించారు.

టిడ్కో ఇళ్లకు వసతుల కల్పన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: పట్టణ లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చిన బోడసకుర్రు టిడ్కో సముదాయంలో వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు పర్యవేక్షణలో ప్లంబింగ్ పనులను మంగళవారం చేపట్టారు. పనుల అనంతరం ఫ్లాట్‌ను అప్పగించి స్వాధీన పత్రాలను వారి నుంచి తీసుకున్నారు.

డ్రైన్‌కు శంకుస్థాపన

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో 15వ ఆర్థిక సంఘ నిధులతో నిర్మించనున్న సీసీ డ్రైన్ నిర్మాణానికి సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు మట్టపర్తి షణ్ముఖరావు, ఉప సర్పంచ్ అడపా దత్తుడు, పరమేష్, దొమ్మేటి శివస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న 9 మంది అరెస్టు

ఐ.పోలవరం: మురమళ్లలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. 9 మందిని అదుపులోనికి తీసుకుని వారి నుంచి రూ.77 వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ

తాళ్లరేవు: స్థానిక టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసారు. పార్టీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.